ప్రజాశక్తి
మంగళవారం 4 ఫిబ్రవరి 2025 5 అనంతపురం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వి.రాంభూపాల్

రాష్ట్ర కమిటీ సభ్యులుగా సావిత్రి, ఓ.నల్లప్ప

వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం

సిపిఎం రాష్ట్ర మహాసభలో అనంతపురం జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా వి.రాంభూపాల్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర కార్యదర్శి వర్గంలో ఉండగా మరోసారి ఎన్నిక అయ్యారు. ఈయనతో పాటు అనంతపురం జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులుగా ఉన్న వి.సావిత్రి, జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పలు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

పెద్దారెడ్డిని గృహ నిర్బంధం చేస్తున్న పోలీసులు

ప్రభాకర్‌రెడ్డి ఇంటి వద్ద పోలీసుల పహారా..

తాడిపత్రిలో టెన్షన్..!

◆ పెద్దారెడ్డి వస్తారన్న నేపథ్యంలో హైఅలర్ట్

◆ తిమ్మంపల్లిలో మాజీ ఎమ్మెల్యే గృహ నిర్బంధం

◆ తాడిపత్రిలో పోలీసు బలగాల మోహరింపు

ప్రజాశక్తి-తాడిపత్రి, యల్లనూరు

తాడిపత్రిలో మరోసారి టెన్షన్ వాతావరణం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తానంటూ చేసిన ప్రకటనతో రాజకీయ అలజడి రేగింది. సార్వత్రిక ఎన్నికల అనంతరం శాంతిభద్రతల దృష్ట్యా పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లేందుకు పోలీసులు అనుమతించలేదు. ఈ విషయంపై ఆయన కోర్టును ఆశ్రయించి తాడిపత్రికి వెళ్లేలా అనుమతులు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు తాను తాడిపత్రికి వెళ్తానంటూ పెద్దారెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. అందులో భాగంగా సోమవారం ఉదయం తన నివాసం నుంచి తాడిపత్రికి బయల్దేరాడు. అప్పటికే ఆయన నివాసం వద్దకు పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. శాంతిభద్రతల నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదంటూ అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సిఐ సత్యాబాబులు పెద్దారెడ్డికి నోటీసులు అందించి గృహ నిర్బంధం చేశారు. పోలీసుల సూచనతో ఆయన తాడిపత్రికి వెళ్లే నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

పోలీసు వలయంలో తాడిపత్రి

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నారన్న సమాచారంతో పోలీసులు పెద్ద సంఖ్యలో పట్టణంలో మోహరించారు. ప్రముఖ రాజకీయ నాయకుల ఇళ్లను పోలీసు వలయంలోకి తీసుకున్నారు. మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి అనుచరులు పెద్ద ఎత్తున సోమవారం ఉదయం ఆయన స్వగృహానికి చేరుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన సంఘటన దృష్ట్యా పట్టణంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ఎఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. టిడిపి, వైసిపి నాయకుల ఇళ్లతో పాటు జూనియర్ కళాశాల మైదానంలో అదనపు బలగాలను మోహరించారు. డ్రోన్లను ఉపయోగించి పరిసర ప్రాంతాలను క్షణంగా పరిశీలించారు. ఎఎస్పీ జెసి నివాసం వద్దకెళ్లి ఆయన అనుచరులను అక్కడి నుంచి పంపించేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రికి రాకుండా పోలీసులు గృహ నిర్బంధం చేస్తున్నట్లు ప్రకటించడంతో పరిస్థితి శాంతించింది.

'పురం' టిడిపి కైవసం..!

◆ మున్సిపల్ ఛైర్మన్‌గా రమేష్ కుమార్ ఎన్నిక ◆ టిడిపికి జై కొట్టిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి హిందూపురం

హిందూపురం మున్సిపల్ పీఠాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. 6వ వార్డు కౌన్సిలర్ రమేష్ కుమార్ హిందూపురం 22వ మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. చేతులెత్తే విధానంలో ప్రొసీడింగ్ అధికారి ఆనంద్ కుమార్ నిర్వహించిన ఎన్నికలో టిడిపి మద్దతుతో బరిలో నిలిచిన రమేష్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో ఎక్స్‌అఫిషియో హోదాలో ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరితో పాటు 23 మంది కౌన్సిలర్లు రమేష్‌ను బలపరచడంతో ఛైర్మన్ టిడిపి వశం అయ్యింది. వైసీపీ తరపున ఛైర్మన్ అభ్యర్థిగా బరిలో నిలిచిన 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మికి అనుకూలంగా 14 ఓట్లు పడ్డాయి. వైసిపికి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. టిడిపి బలపర్చిన అభ్యర్థి రమేష్ కుమార్‌కు సంపూర్ణ మెజార్టీ ఉండడంతో ఛైర్మన్‌గా ఆయన్ను ప్రొసీడింగ్ అధికారి ఆనంద్ కుమార్ ప్రకటించారు. ఎన్నిక అనంతరం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ, ఎంపీ పార్థసారథి సమక్షంలో ప్రొసీడింగ్ అధికారి రమేష్ కుమార్‌కు డిక్లరేషన్ అందించి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు, తహశీల్దార్ వెంకటేశు, ఉప తహసిల్దార్ మైనుద్దీన్, కౌన్సిలర్లు

ఛైర్మన్ రమేష్ కుమార్

టిడిపి కౌన్సిలర్లతో విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి

వైసిపి కౌన్సిలర్ల నిరసన

ఛైర్మన్ ఎన్నికలో అధికారులు ఏక పక్షంగా వ్యవహరించారని వైసిపి కౌన్సిలర్లు ఆరోపించారు. కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని వైసీపీ కౌన్సిలర్లు బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. అధికార పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇదే సమయంలో జై బాలయ్య అంటూ టీడీపీ కౌన్సిలర్ల నినాదాలు చేశారు.

చక్రం తిప్పిన బాలయ్య

టిడిపి మద్దతు కౌన్సిలర్లతో మున్సిపల్ కార్యాలయంలోకి వస్తున్న బాలకృష్ణ

గత మున్సిపల్ ఎన్నికల్లో హిందూపురం మున్సిపాలిటీ లోని 38 వార్డుల్లో వైసీపీ 29 గెలుచుకుంది. టిడిపి ఆరు స్థానాలకే పరిమితం అయింది. బీజేపీ, ఎంఐఎం చెరో ఒక్కో వార్డు గెలుచుకోగా స్వతంత్ర అభ్యర్థి ఒకరు గెలిచారు. స్వతంత్ర అభ్యర్థి గెలచిన వెంటనే వైసిపిలో చేరారు. 30 స్థానాలతో పురపాలక సంఘంలో వైసిపి అధికారం చేపట్టింది. కూటమి అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ నాయకులు మున్సిపల్ స్థానాన్ని ఎలాగైనా కైవశం చేసుకోవాలని పావులు కదిపారు. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల క్రితం ఛైర్‌పర్సన్ ఇంద్రజ తన పదవికి రాజీనామ చేశారు. ఇంద్రజతో పాటు మరో 11 మంది కౌన్సిలర్లు వైసిపికి రాజీనామ చేసి బాలకృష్ణ సమక్షంలో టిడిపిలో చేరారు. వీరితో పాటు స్వతంత్ర అభ్యర్థి, ఎంఐఎం, బిజెపి కౌన్సిలర్లు టిడిపికి మద్దతు తెలిపారు. హిందూపురం ఛైర్మన్ పీఠం ఎలాగైన టిడిపి ఖాతాలో వేసుకోవాలని ఎమ్మెల్యే బాలకృష్ణ చక్రం తిప్పారు. మూడు నెలల క్రితమే ఎన్నికలు వస్తాయని టిడిపి ఆశించి క్యాంపు రాజకీయాలు చేసింది. విజయవాడ వరదల కారణంగా ఎన్నిక కార్యక్రమం ఆలస్యం అయ్యింది. ఎన్నికల కమిషన్ 3వ తేదీ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే అప్రమత్తమైనా టిడిపి వారి కౌన్సిలర్లతో పాటు పార్టీలో చేరిన వైసిపి కౌన్సిలర్లను క్యాంపునకు తరలించింది. సోమవారం ఛైర్మన్ ఎన్నిక సమయంలో వారిని ప్రత్యేక వాహనంలో మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఎన్నిక నిర్వహణ, కౌన్సిలర్లు మద్దతు తెలపడం.. ఛైర్మన్‌గా టిడిపి అభ్యర్థి రమేష్ కుమార్ గెలవడం చకచకా జరిగాయి. గతంలో అధికారం లేక చేజారిన మున్సిపల్ పీఠాన్ని టిడిపి అధికారంలోకి వచ్చిన అనంతరం వారి ఖాతలో వేసుకుంది.

ర్యాపిడోను నిషేధించాలి

కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

◆ ఆటో కార్మికుల డిమాండ్

◆ కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికుల పొట్టగొట్టే ర్యాపిడోను అనంతలో పూర్తిగా నిషేధించాలని ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ర్యాపిడోను అనంతలో నిషేధించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు అనంతలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వందలాది మంది ఆటో కార్మికులు కృష్ణ కళామందిరం నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద బైటాయించి ర్యాపిడోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా, జిల్లా నాయకులు వెంకటనారాయణ, గోపాల్ మాట్లాడుతూ నగరంలో దాదాపు 20వేల ఆటోలు ఉన్నాయన్నారు. వీరందరికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం లేకపోయినా సొంత కాళ్లపై నిలబడి తమ కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆటోలను అప్పులు చేసి కొనుగోలు చేశారన్నారు. ఇలాంటి తరుణంలో ర్యాపిడో ప్రయివేటు సంస్థ నగరంలో ప్రవేశించి ఆటో కార్మికుల జీవనాధారాన్ని నాశనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటో కార్మికులు బాడుగులు రాక కుటుంబం గడవని పరిస్థితులు ఉన్నాయన్నారు. ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అజాం బాషా, ఆదినారాయణ మాట్లాడుతూ ర్యాపిడో రాకతో ఆటో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. ర్యాపిడో ప్రస్తుతం తక్కువ ధరలు అని ప్రజలకు ఆశ చూపుతున్నారని, తర్వాత వారి ఇష్టం వచ్చిన ధరలను పెంచేస్తారన్నారు. ఆటో కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ర్యాపిడోను అనంతలో నిషేధించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్వో మలోల ఆందోళనకారుల వద్దకొచ్చి వారి సమస్యలను విన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల ఆందోళనకు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజు, నగర కార్యదర్శి తిరుమలేష్, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు లతీఫ్, అంబులెన్స్ యూనియన్ కార్యదర్శి జిలాన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నూరుల్లా తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాగరాజు, ఎన్టీఆర్ సీనా, రామలింగారెడ్డి, శీనా, నాగేంద్ర, చంద్రమౌళి, గఫూర్, ఉలిగప్ప, మదార్ వలి, పెరుగు గోపాల్, శీనా, నారాయణస్వామి పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి చర్యలు

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విలేకరులతో మాట్లాడుతున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అనంతపురం జిల్లాలో క్రీడల అభివద్ధికి చర్యలు చేపడుతున్నామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. అనంతపురం డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీని సోమవారం ఆయన సందర్శించారు. ఆర్చరీ, ఫెన్సింగ్, కబడ్డీ, వివిధ స్పోర్ట్స్ కోర్టులను పరిశీలించారు. డీఎస్ఎ నిర్వహణ, అభివద్ధి పనుల పురోగతి, క్రీడావసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. అనంతపురంలో స్టేడియం ఏర్పాటుకు స్థల సమస్య ఏర్పడిందని, మల్టీపర్పస్ స్టేడియానికి అనుగుణంగా సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలో 15 ఎకరాల స్థలాన్ని గుర్తించామని వివరించారు. స్థల సేకరణలో సాంకేతిక సమస్యలున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ సాయంతో త్వరలోనే స్టేడియం ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం, శాప్ నిధులతో అనంతపురంలో స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. అనంతపురం డీఎస్ఏ అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళికలతో డీపీఆర్‌లు సిద్ధం చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని రాజకీయక్రీడగా మార్చిందని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ.119 కోట్లను వైసీపీ ప్రభుత్వం కొల్లగొట్టిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడాకారులను తయారుచేయాలనేది విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి సంకల్పం అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ యువతను, విద్యార్థులను తప్పుదోవపట్టిస్తుందని, ఫీజుపోరు పేరుతో యువతను రాజకీయంగా వాడుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎస్‌డిఒ విజయభాస్కర్, డీఎస్ఏ సెక్రెటరీ సుబ్బారావు, స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి పాల్గొన్నారు.

9న ప్రజ్ఞా వికాస్ పరీక్షలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త కెఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ పట్టణంలో పదో తరగతి విద్యార్థులకు 'ప్రజ్ఞ వికాస్' పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ తెలిపారు. ఈ మేరకు సోమవారం సిఐ పరీక్షల పోస్టర్లను విడుదల చేశారు. శివ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొందరు విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని అధిగమించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పదో తరగతి విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టడం కోసం మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు హాజరవ్వాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బంగి శివ 63023 17927, వలి 63003 23431, యుటిఎఫ్ నాయకులు వెంకట్రామిరెడ్డి 85228 98620 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా మడుగు తేరు ఉత్సవాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణంలోని సోమవారం శ్రీపట్టాభి రామస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు వేకువజాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, కలశ స్థాపన, తదితర విశిష్ట సేవలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్థానిక టిడిపి నాయకులు, భక్తులతో కలిసి మడుగుతేరు లాగారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఆసుపత్రిలో జరుగుతుందని మండలి కన్వీనర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.మెర్సీజ్ఞానసుధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సలహా మండలి అధ్యక్షులు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. సలహా మండలి నూతన సభ్యులుగా జయంతి సురేష్, పొగనూలు కళ్యాణ చక్రవర్తి, కొండాపురం శ్రీనివాసులు, సంపత్ కుమారిలను నియమించినట్లు ఆమె తెలిపారు. వారితో పాటు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, ఎపిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాసులు నాయుడు, మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ నారాయణస్వామి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మెర్సీ జ్ఞానసుధ సభ్యులుగా వ్యవహరిస్తారు.

అభివృద్ధి పథంలో తాడిపత్రి

మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి

ప్రజాశక్తి తాడిపత్రి

తాడిపత్రి నియోజకవర్గం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బిసి.జనార్దన్ రెడ్డి తెలియజేశారు. తాడిపత్రి పట్టణంలో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి ఇంటికి సోమవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పెద్దారెడ్డి నిరంకుశత్వ దుర్మార్గాలను జెసి.ప్రభాకర్ రెడ్డి ధైర్యంగా ఎదుర్కొన్నారని చెప్పారు. తాడిపత్రి నియోజకవర్గాన్నీ అభివద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. జిల్లాలో రోడ్ల అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరు కాగా అందులో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు రూ.11 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. అనంతరం తాడిపత్రి అభివృద్ధిపై జెసి మంత్రితో సమీక్షించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మంత్రి వెంట వచ్చి జెసి ప్రభాకర్ రెడ్డిని కలిశారు.

ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న మంత్రి జనార్ధన్‌రెడ్డి

లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రాయదుర్గం

లింగ వివక్షకు వ్యతిరేకంగా పౌరులకు అవగాహన కల్పించడం, బాలికల సంక్షేమం, సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచాలని ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. పట్టణంలోని కోటవీధి, 13వ సచివాలయం పరిధిలో సోమ వారం 'భేటీ బచావో-భేటీ పడావో', పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడు తూ ప్రతి బాలిక చదువుపై దృష్టి సారించి చదువుకున్నప్పుడే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను తెలియజేయాలన్నారు. లింగ వివక్ష చూపకూడదని తెలిపారు. పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా, సహకరించినా రూ. 10వేల జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష పడుతుందని తెలిపారు. ర్యాలీలో ఆరోగ్య పర్యవేక్షకులు శాంతకుమారి, లక్ష్మినరసమ్మ, పారిశుధ్య, ఆరోగ్య కార్యదర్శులు అరుణ, సునీత, సుజాత, శైలజ, ఆశా కార్యకర్తలు లక్ష్మిదేవి, సునీత, సుబ్బలక్ష్మి, స్వాతి, శారద పాల్గొన్నారు.

అడ్డుగా ఉన్నా తొలగించరా..?

దారికి అడ్డుగా పడి ఉన్న చెట్టు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో ఎంబిఎ కళాశాలకు ఎదురుగా ఉన్న చెట్టు గత శనివారం గాలికి కూలిపోయింది. దారికి అడ్డుగా పడిన ఈ చెట్టును సోమవారం అయినా తొలిగించలేదు. చెట్టు అడ్డుగా ఉండడంతో ఎంబిఎ విద్యార్థులు, సిబ్బంది కళాశాలలోకి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి దారికి అడ్డుగా ఉన్న చెట్టును తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధరతో వరి ధాన్యం కొనుగోలు : విప్

సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని తుంగభద్ర ఆయకట్టు కింద వరి పంట పండించిన రైతుల నుంచి సొసైటీ సహకారంతో గిట్టుబాటు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో సోమవారం రైతులు ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందించడంతో పాటు గిట్టుబాటు ధరతో వరి ధాన్యం కొనుగోలు చేసి 48 గంటల్లోపే వారి ఖాతాలో నగదు జమ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందని కొనియాడారు. శ్రీధరఘట్ట చెరువుకు ప్రత్యేక డిస్ట్రిబ్యూటర్ ఏర్పాటు చేస్తామన్నారు. నేమకల్లు గ్రామం వద్ద రిజర్వాయర్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారని, అది త్వరలోనే కార్యరూపం దాలుస్తుందని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో వసంతబాబు తహశీల్దార్ మునివేలు, ఎంపీడీవో భాస్కర్, సొసైటీ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ బలరామిరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు కేశవరెడ్డి, మాజీ జడ్పిటిసి జగన్నాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'జిందాల్' సహకారంతో విద్యార్థులకు ఉచిత బస్సులు

చదువుకునేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి బొమ్మనహాల్‌కు వచ్చే విద్యార్థుల కోసం జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రత్యేకంగా రెండు బస్సులు ఏర్పాటుచేసింది. వాటిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. కొరవల్లి, చంద్రగిరి, సిద్ధరాంపురం గ్రామాలకు ఓ బస్సు, హరేసముద్రం గ్రామానికి మరో బస్సు ఏర్పాటు చేయడంపై ప్రభుత్వ విప్ కాలవ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం విద్యార్థుల కోసం చూపిన చొరవను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, ప్రభయస్వామి, పెద్దరామన్న, సిద్ధగౌడ్ పాల్గొన్నారు

అర్జీలకు త్వరితగతిన పరిష్కారం : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : వివిధ సమస్యలపై ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందించే అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపించాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఒ ఎ.మాలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి ప్రజల నుంచి 418 అర్జీలను స్వీకరించారు. అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంతకల్లు

స్థానిక ఆర్‌టిఒ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్యశిబిరంలో డ్రైవర్లందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ నీలం వెంకట రాజాబాబు పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల డ్రైవర్లు అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం లేదన్నారు. కావున స్థానిక ఆర్టీవో కార్యాలయం వద్ద నంద్యాలకు చెందిన శాంతి రామ్ ఆసుపత్రి వారి సౌజన్యంతో నిర్వహించనున్న వైద్య శిబిరంలో వైద్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో, లారీ, జీపు డ్రైవర్లు, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవిఐ రాజాబాబు

ఘనంగా వసంత పంచమి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాల డైరెక్టర్లు ఎంపి శ్రీనివాసులు, సి.కరుణాకర్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్యరామ్, తదితరులు విద్యార్థులతో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.

అలాగే సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళీ హాజరైన చిన్నారులను దీవించారు. అలాగే కమిటీ సభ్యులు, ప్రభంధకారిణి సభ్యులు విసి నరసింహులు, ఎస్.బద్రీనాథ్, లక్ష్మన్న, డి.వెంకటేశ్వర్లు, ఆళ్లగడ్డ రాము, వరలక్ష్మి, కె.రాఘవయ్య, డాక్టర్ విజయ్ సాయి ఆధ్వర్యంలో హోమం చేశారు. ఈ కార్యక్రమంలో యూ ట్యూబర్ మహిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

అనంతపురం క్రైం : స్థానిక పాపంపేటలోని సరస్వతీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సోమవారం సామూహిక అక్షరాభ్యాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో 100మందికిపైగా విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సి.రామచంద్ర, హెచ్‌ఎం జబీనా, ఎఒ బాషా, రోజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రంగరాయలు సర్కిల్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద జాతీయ రహదారిపై రంగరాయలు సర్కిల్ ఏర్పాటు చేయాలని టిడిపి, కాంగ్రెస్, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ సాకే బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రం నుంచి అమరావతి వరకూ ఏర్పాటు చేస్తున్న జాతీయ రహదారి 544-డి కారణంగా నియోజవర్గ కేంద్రానికి వచ్చే రహదారి మూసుకుపోయింది. కావున తక్షణమే రంగరాయుల సర్కిల్ ఏర్పాటు చేసి నియోజకవర్గ కేంద్రానికి దారి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ ఓబిసి నాయకులు రామ్‌చరణ్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.చిన్నప్పయాదవ్, నాయకులు మధుయాదవ్, చేనేత మధు, వెంకటరెడ్డి, నారప్ప, బండి వెంకటరాముడు, బాలిరెడ్డి, ఆదెన్న, సుంకన్న, శ్రీనివాసులు, రామాంజనేయులు, మసూద్, వీరాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుండె చికిత్సపై అవగాహన

గుత్తి : గుండె సంబంధిత సమస్యల నివారణ కోసం ఉపయోగించే తెనెక్టెప్లస్ ఇంజక్షన్‌పై సోమవారం స్థానిక సామాజిక వైద్యశాలలో వైద్యసిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప మాట్లాడుతూ రూ.45వేలు విలువజేసే తెనెక్టెప్లస్ ఇంజక్షన్ ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. గుండె నొప్పి వచ్చిన వారికి గంటలోపు ఇంజక్షన్ ఇస్తే మరణం నుంచి కాపాడవచ్చన్నారు. ఇప్పటి వరకూ గుత్తి ప్రభుత్వాసుపత్రిలో 26 మందికి ఇంజక్షన్ చేశామని తెలిపారు. ఇందులో 20 మందికి అనంతపురంలో ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్సలు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా, బి.రమేష్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, నాయకులు జక్కలచెరువు ప్రతాప్, ఆర్.సాల్మన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న వక్త

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు, యువత ఆన్‌లైన్ గేములకు దూరంగా ఉండాలని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ సూచించారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో 'బాధ్యతాయుత గేమింగ్‌పై' వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మోసపూరిత గేములు, వెబ్‌సైట్‌ల నుంచి విద్యార్థులను రక్షించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఆన్‌లైన్ గేములపై వర్క్‌షాప్ నిపుణులు కుమారి అర్ణిక, విక్రం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-రాప్తాడు

ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నిర్మిస్తున్న గోకులం షెడ్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళి కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో నిర్మించుకున్న గోకులం షెడ్లను అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అపారమైన పశువనరులు, కోళ్లు, పశువులు, గొర్రెల పెంపకం వంటి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయకుమారి, ఎంపిడిఒ బుల్లే విజయలక్ష్మి, సర్పంచులు, పాల్గొన్నారు.

ఎపిజిబి కార్యాలయాన్ని తరలించొద్దు

అనంతపురం : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలించకూడదని వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతులతో ముడిపడిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని తరలిస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. కావున బ్యాంకును కడపలోనే కొనసాగించాలని కోరారు.

రసాయనిక మందులు కలిపిన నీరు తాగి గేదెలు మృతి

కళ్యాణదుర్గం రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని దొడఘట్ట గ్రామంలో రసాయనిక మందులు కలిపిన నీరు తాగి సోమవారం రెండు గేదెలు మృతి చెందాయి. బాధిత రైతు తలారి కవెల్లప్ప తెలిపిన వివరాలు.. ఆయన మాట్లాడుతూ రెండు గేదెలను పోషించుకుంటూ వాటి పాలను అమ్మి జీవనం సాగిస్తున్నామన్నారు. రోజూ తరహాలోనే గేదెలను మేత కోసం అడవికి తీసుకెళ్లాలని, మేత మేసిన తర్వాతా ఓ వ్యవసాయ తోటలో నీరు తాపామన్నారు. అందులో రసాయనిక మందులు కలిపి ఉండడంతో ఆ నీరు తాగి రెండు గేదెలు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

5న 'అనంత ఉద్యాన సమ్మేళనం'

2047 నాటికి 'స్వర్ణ అనంత'గా తీర్చిదిద్దేందుకు శ్రీకారం-కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా రైతులను ప్రోత్సహించేందుకు ఈనెల 5వతేదీన అనంతపురంలోని బళ్లారి రోడ్డులో ఉన్న ఎంవైఆర్ కన్వెన్షనల్ హాల్‌లో నిర్వహించనున్న అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పిలుస్తామని, ఇక్కడ ఉద్యాన పంటల సాగుకు విపరీతమైన అవకాశం ఉందన్నారు. జిల్లాలో పండిస్తున్న అరటి, మామిడి, చీనీ తదితర పంటలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. జిల్లాలో 1,04,021 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగు అవుతున్నాయన్నారు. 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన ఉత్పాదకత ఉందన్నారు. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లా జివిఎలో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తులు ద్వారా వస్తోందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జిఎస్‌డిపిలో 11.73 శాతం వాటా అనంతపురం జిల్లా అందిస్తోందన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, జిల్లాలు ఎక్కడ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ప్రణాళికను రూపొందించారని తెలిపారు. ఆ ప్రక్రియలో జిల్లాలో 5 గ్రోత్ ఇంజన్స్‌ను గుర్తించామన్నారు. జిల్లా 17శాతం అభివృద్ధిని రాబోయే 5 సంవత్సరాల్లో చేయొచ్చన్నారు. జిల్లాలో అరటి, ఎండుమిరప, బత్తాయి, టమోటా, మామిడిపండ్లను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజన్స్‌గా గుర్తించామన్నారు. రాష్ట్ర, దేశస్థాయితో పాటు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో అనంతపురంలో జాతీయస్థాయి కాంక్లేవ్‌ని ఏర్పాటు చేశామన్నారు. నెల రోజులుగా ఈ కార్యక్రమంపై కసరత్తు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టీజీ.భరత్ వర్చువల్‌గా పాల్గొంటారని, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడును ఆహ్వానించామన్నారు. అగ్రికల్చర్, కోపరేటివ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ప్రోగ్రామ్ మెంటార్‌గా ఉంటారన్నారు. లేటెస్ట్ టెక్నాలజికల్ డెవలప్‌మెంట్, ప్రీ హార్వెస్ట్, హార్వెస్ట్, పోస్ట్ హార్వెస్ట్ ఈ మూడు స్థాయిలో కూడా చివరి వరకు టైఅప్ చేయమని ముఖ్యమంత్రి చెప్పారని, ప్రతి దాంట్లో ప్రోడక్ట్ ఫర్ఫెక్షన్ తీసుకోవచ్చని, గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లాలంటే నాణ్యత అవసరమన్నారు. ఇప్పటికే జాతీయస్థాయిలో 64 కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయని, అందులో 6 పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఒయులు) తీసుకుంటున్నామన్నారు. అనంతపురం జిల్లా ఉద్యాన ఉత్పత్తులను బ్రాండింగ్ చేయడం, ప్రచారం కల్పించడం, కోల్డ్ స్టోరేజ్‌లు, ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, మార్కెట్లో పోటీతత్వం పెంచడం, రైతులకు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో అవగాహన పెంపొందించడం, రెండింతలు ఆదాయం రైతుకు కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్‌ఓ ఏ.మాలోల, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, హార్టికల్చర్ అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

'ఫీజుపోరు'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వతేదీన అనంతపురంలో నిర్వహించనున్న ఫీజుపోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైసిపి అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న అనంతపురంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కావున జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు, స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐఎస్‌బి జిల్లా ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వీ, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర, జిబిఎస్‌ఎస్ జాతీయ ఉపాధ్య క్షులు మల్లికార్జుననాయక్, గిరిజన విద్యార్థి నాయకులు లక్ష్మీపతినాయక్, ఎఐఎస్‌బి జిల్లా అధ్యక్షులు బిల్లే జగదీష్, ఎస్వీఎస్‌ఎఫ్ బీసీ చక్రధర్‌యాదవ్, హర్ష ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జన్నే చిరంజీవి, బిసి ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఉరవకొండ : విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వతేదీన అనంతపురంలో నిర్వహించనున్న ఫీజుపోరు ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఆయన తనయుడు వై.భీమరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.3,900కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

రంగనాథస్వామి ఆలయానికి రూ.9.55 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో ఉన్న బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో టెంకాయల విక్రయ హక్కు కోసం నిర్వహించిన వేలంపాటల ద్వారా ఆదాయం లభించింది. సోమవారం ఆలయ ఆవరణలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాణి, ఆలయ కార్యనిర్వహణాధికారి సి. రామాంజనేయులు సమక్షంలో టెంకాయల విక్రయ హక్కు కోసం వేలంపాట నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సమయంలో టెంకాయల విక్రయ హక్కు కోసం రఘునాథ్‌రెడ్డి అనే వ్యక్తి రూ.3.05 లక్షలకు పాట దక్కించుకున్నాడు. గతంలో రూ.4.22 లక్షలకు వేలంపాట పోయింది. అలాగే ఏడాది పాటు ఆలయ వద్ద టెంకాయల విక్రయ హక్కు కోసం మండలంలోని వన్నెదొడ్డి గ్రామానికి చెందిన బీరప్ప రూ.6.50లక్షలకు వేలంపాట దక్కించుకున్నాడు. దీంతో ఆలయానికి రూ.9.55 లక్షల ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ బి.రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు పి.రవికుమార్, గ్రామ పెద్దలు బి.చిన్నరెడ్డి యాదవ్, డేగ మద్దిలేటి, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

దందాలకు పాల్పడితే వేటు తప్పదు

టిడిపి నాయకులకు ఎమ్మెల్యే హెచ్చరిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తన పేరు చెప్పి ప్రజలతో కొంత మంది దందాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. దందాలకు పాల్పడితే తమ్ముడు తనవాడైన ఉపేక్షించే పరిస్థితి లేదని ఆయన హెచ్చరించారు. ప్రజల నుంచి అక్రమ వసులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.సోమవారం ఆయన మాట్లాడుతూ తనకు ఇతర రాష్ట్రాల్లో వివిధ కంపెనీలు ఉన్నాయని నాకు ఓటు వేసిన ప్రజల దగ్గర నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడే సంస్కృతి తనకు లేదన్నారు. అధికారులపై దౌర్జన్యానికి దిగితే ఇకమీదట సహించే ప్రసక్తి లేదన్నారు. అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

'సూపర్-60'కి 10 మంది విద్యార్థులు

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 10మంది విద్యార్థులు సూపర్-60కు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. 12 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 10 మంది అర్హత సాధించినందుకు ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కంది కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన కంది కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రం సమీపంలోని గోవిందరాయునిపేట వద్ద రహదారి పక్కన ఉన్న గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కంది విక్రయాలను ఎఒ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. కంది పంట సాగు చేసి రైతులు మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో పంట విక్రయానికి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. క్వింటా కంది పంటను రూ.7,550లతో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. మొదట రైతులు కంది పంటను శాంపిల్ తీసుకొచ్చి మార్క్‌ఫెడ్ సిబ్బంది శివారెడ్డికి చూపించాలన్నారు.

కేంద్రానికి వచ్చిన కందులను పరిశీలిస్తున్న ఎఒ అన్వేష్ కుమార్

మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బి.బాలస్వామిని నియమించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్న బి.బాలస్వామిని అనంతపురం కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రమాద బాధితురాలికి పరామర్శ

రాప్తాడు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గొందిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రమ్మను సోమవారం అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ఇందులో భాగంగా ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

సబ్‌స్టేషన్ ప్రారంభం

సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు : మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో ఏర్పాటు చేసిన 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ప్రారంభించారు. అనంతరం అచ్యుతాపురం చిలమకూరు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హాస్టళ్లను శుభ్రంగా ఉంచకపోతే చర్యలు

గుత్తి : ప్రభుత్వ వసతి గృహాలను శుభ్రంగా ఉంచకపోతే వార్డెన్లపై చర్యలు చేపడతామని సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి బి.రాధిక హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర-1వ వసతిగృహాన్ని పరిశీలించారు. ఇందులో భాగంగా వార్డెన్లు, విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం రూ.14.55 లక్షల నిధులతో చేపట్టిన హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని గుత్తేదారును ఆదేశించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణారెడ్డి, వార్డెన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిణి బి.రాధిక

శాప్ ఛైర్మన్‌కు సన్మానం

శాప్ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం : అనంతపురం యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడును సోమవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఘనంగా సత్కరించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారి వై.ఆంజనేయులు, ఇతర సభ్యులు ఎన్.దివాకర్, గురురాజారావు, తారక్ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించాలని వినతి

అనంతపురం : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డును తరలించాలని లెక్చరర్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు జి.కిష్టప్ప, పి.సురేష్ కోరారు. సోమవారం లెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అదనపు కలెక్టర్‌తోపాటు కాలుష్య నియంత్రణ అధికారులకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు నుంచి వచ్చే కాలుష్యం వల్ల లెక్చరర్స్ కాలనీ విషతుల్యంగా మారిందన్నారు. కావున వెంటనే ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్ యార్డును మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకులు కసిరెడ్డి కృష్ణారెడ్డి, మాదాసి నాగప్ప, విశ్రాంత ప్రిన్సిపాల్ బాషా, తెలుగు వెలుగు టీవీ రెడ్డి, బాలకృష్ణ, గోపాల్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్.వెంకటేష్‌నాయక్‌కు అభినందనలు

అనంతపురం : ఇటీవల ఢిల్లీ నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పరేడ్‌లో పాల్గొని విచ్చేసిన అనంతపురం జెఎన్‌టియులో విద్యనభ్యశిస్తున్న ఎస్.వెంకటేష్ నాయక్‌ను కళాశాల అధ్యాపకులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌నాయక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డి విసి ఎన్.దేవన్న, జాతీయ సేవాసమితి ప్రోగ్రాం ఆఫీసర్ జి.మమత, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శారద, వి.సుమలత, రమణారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మాజీ ఆచార్యులు గిరిప్రసాద్, ఎస్.అరుణ మస్తాని, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేష్‌నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

హుండీ లెక్కింపు

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవానీ భీమలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటివారం వచ్చిన హుండి ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. తాత్కాలిక హుండీల ద్వారా రూ.4,91,527, శాశ్వత హుండీల ద్వారా రూ.4,39,569 వచ్చిన ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే విరాళాల ద్వారా రూ.2,300, శీఘ్ర దర్శనం ద్వారా రూ.1,34,150, తలనీలాల ద్వారా రూ.14075, అభిషేకం ద్వారా రూ.300 ఆదాయం వచ్చినట్లు ఇఒ సుబ్రమణ్యం తెలిపారు

నేరాలు ఘోరాలు

కళాశాలలో విరిగిపడిన ఫ్యాను

విద్యార్థినికి గాయాలు

ఉరవకొండ : మండలంలోని చిన్నముష్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్యాన్ విరిగి పడటంతో ఓ విద్యార్థిని గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. స్కిల్ హబ్ కోచింగ్‌లో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు డేటా ఎంట్రీ, కంప్యూటర్ తదితర కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు హాజరైన బికాం ఫైనల్ ఇయర్ చదువున్న చంద్రకళపై ఒక్కసారిగా ఫ్యాన్ విరిగిపడింది. దీంతో గాయపడిన విద్యార్థినిని అధ్యాపకులు, తోటి విద్యార్థులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. కాగా పాలిటెక్నిక్ కళాశాలలో మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని

ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పెద్దోడి గ్రామంలో నివాసం ఉండే డ్రైవర్ రవి మట్టి తరలించేందుకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. బసినేపల్లి గ్రామ వద్ద ట్రాక్టర్ రివర్స్ చేస్తుండగా బోల్తా పడింది. దీంతో రవి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

కారు..లారీ ఢీ..

పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం ఎదురుగా సోమవారం ఓ కారును లారీ ఢీకొంది. బెంగళూరు నుంచి మంత్రాలయం వైపు వెళుతున్న కారును వెనక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో కారు డివైడర్‌పైకి ఎక్కింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటమి భయంతోనే తెరపైకి డీఎస్సీ పోస్టులు

వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ భాసిద్

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటమి భయంతోనే కూటమి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ తెరపైకి తెచ్చిందని వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాషిద్ అన్నారు. సోమవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టిన చంద్రబాబు తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్ పైనే పెట్టారన్నారు. అయితే తొలి సంతకం చేసి ఎనిమిది నెలలు అవుతున్నా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పుడు పాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్నందున యువతను మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటన చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం ముగిసేలోగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యువజన విభాగం నాయకులు మద్దికెర ప్రతాప్, ప్రశాంత్, మనోజ్, దిలీప్, కసాపురం మధు, జాఫర్, మస్తాన్, ప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ భాసిద్

క్యాన్సర్‌ను సమిష్టిగా ఎదుర్కొందాం

సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జిఎంఎన్.ఉన్నతి-నేడు అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్ మహమ్మారిని సమిష్టిగా ఎదుర్కోవాల్సిన ఆవశ్యకత చాలా అవసరమని సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ జిఎంఎన్.ఉన్నతి పిలుపునిచ్చారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆమె పలు విషయాలను పంచుకున్నారు. క్యాన్సర్ చికిత్సలో వ్యాధిని ముందుగా గుర్తించడం, తగిన సమయంలో చికిత్స తీసుకోవడం, మానసిక ప్రేరణ అనేది చాలా అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 10 లక్షల మందికిపైగా క్యాన్సర్‌తో మరణిస్తున్నారన్నారు. అంతేగాకుండా మరణాల జాబితాలో క్యాన్సర్ రెండవ ప్రధాన కారణం వర్ధమాన దేశాలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న దేశాల్లో పది మరణాల్లో ఏడు మరణాలు క్యాన్సర్ కారణంగా సంభవిస్తున్నాయన్నారు. శరీరంలో ఏదైనా అవయవానికి క్యాన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవన్నారు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధారణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయన్నారు. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసుకోవడం సాధ్యం కాదన్నారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదనీ, అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే నన్నారు. అయితే రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యుపరంగా సంక్రమిస్తాయన్నారు. కుటుంబంలో ఎవరికైనా ఈ క్యాన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉందన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించకపోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవన్నారు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కోవాలన్నారు. కొన్ని రకాల క్యాన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చన్నారు. వీటిలో ముఖ్యంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పివి వైరస్ అన్నారు. దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించవచ్చన్నారు. 9ఏళ్ల పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చన్నా. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుందన్నారు. క్యాన్సర్‌ను జయించడం, త్వరగా గుర్తించడంతో పాటు ఆ కణితులు పరిమాణం, దశ, గ్రేడింగ్ కూడా చాలా ముఖ్యమన్నారు. కాన్సర్‌కు వయసుతో సంబంధం లేదనీ అన్ని వయసుల వారూ దీని బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కానీ చిన్నపిల్లల్లో వచ్చే క్యాన్సర్లను చాలా వరకూ పూర్తిగా నయం చేయగలిగేవే అన్నారు. అయితే, వయస్సు పెరిగేకొద్దీ క్యాన్సర్స్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరపీ, రేడియోథెరపీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్‌థెరపీ లాంటివి చేసినా, లేక థెరపీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయిపోయిందని భావించరాదన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.